## అనగనగా... ఒక కథ

శ్రీ

# బంధం

ఇరవై మూడేళ్లు పెంచాక రాజేంద్రతో- "ఒరే నాన్నా నువ్ మా కన్నకొడుకువి కావురా- నిన్ను మేం పెంచుకున్నాం" అని చెప్పాలంటే మనసు రావట్లేదు నాకు.

ఆ విషయం చెప్పాల్సిన పరిస్థితి ఇప్పుడొచ్చింది- చెప్పాలి! చెప్పక తప్పదు!! 'వాడు కొన్నాళ్లైనా కన్నతల్లి దగ్గర ఉండాలి' అని మెదడు వత్తిడి తెస్తోంది. మనస్సే మొండికేస్తోంది! ఈ సంగతి వాడికి తెలిస్తే తట్టుకోగలడా!

అసలు నా భార్య ఒప్పుకుంటుందా చెప్పడానికి- ఆవిడతో మాట్లాడాలన్నా గొంతు పెగలదు అనిపిస్తోంది.

నిజం - మా ఆవిడా నేనూ.....

ఇరవై మూడేళ్లు వాడి ఆలనాపాలనాతో పులకించిపోయాం. వాడి చదువులో సాధిస్తున్న విజయాలకి మురిసిపోయాం. మా కుటుంబ సభ్యుల్లో స్నేహితుల్లో వాడొక మోడల్ బాయ్‌గా మెరిసిపోతుంటే బ్రహ్మానందపడుతున్నాం. ఇప్పుడు వాడికి చెప్పాలి.

"అరె... నాన్నా ఈమె మీ అమ్మ" అని నివేదితని పరిచయం చేయాలంటే....మాకెంత ధైర్యం కావాలి. మా ఆవిడకి చెప్పడం కన్నా ముందు నివేదిత ఇంటికి వెళ్లాను. కాలింగ్ బెల్ నొక్కితే ఓ అమ్మాయి తలుపు తీసింది.

"అమ్మగారు లేరండి...నైట్ డ్యూటీ- సుమిత్రా ఆసుపత్రిలో ఉంటారు. మీరు ఎవరండీ?"

నేను...ఎవరని ఆ అమ్మాయికి చెప్పను? విజిటింగ్ కార్డ్ ఇచ్చి...

"రేపొకసారి నేను రమ్మన్నానని చెప్పు" అన్నాను.

ఇంటికెళ్లాలనిపించట్లేదు. కానీ వెళ్లాలి! చాలా ప్రశ్నలకి జవాబు చెప్పాలి. తల్లీకొడుకూ వేసే ప్రశ్నల్నించి తప్పించుకునే ఓపిక నాకు లేదు.

అలా అలా రోడ్డుమీద తిరిగి తిరిగి రాత్రి పదకొండౌతుంటే ఇంటికెళ్లాను. నా భార్య అనుకున్నట్టుగానే... తలుపులు తీసుకుని ఎదురుచూస్తోంది. బైకు ఇంటి ముందు పార్క్ చేస్తూంటూనే బయటకొచ్చింది. ఇంట్లోకెళ్తుంటేనే అడ్డగిస్తూ అడుగుతుందనుకున్న ప్రశ్న ఆమె నోటమ్మట వచ్చింది.

"రిపోర్టులు వచ్చాయా? డాక్టర్ ఏమన్నాడు?"

"రిపోర్టులు పట్టుకుని డాక్టర్ టేబుల్ మీద పెట్టొచ్చాను ఆయన లేడు" ప్లాన్ చేసుకున్న అబద్ధం ఆడేశాను.

"రాజు ఎలా ఉన్నాడు?" ప్రేమున్నా క్యాజువల్‌గా అడిగాను.

"బాగానే ఉన్నాడు. వాడికిష్టమైన కర్రీ, చట్నీ చేసి భోజనం పెట్టాను. హాపీగా తిని, కాసేపు కంప్యూటర్‌తో గడిపాడు. ఇంతలో మీ మేనకోడలు ఫోన్ చేసింది. జోకులేసుకుంటూ మాట్లాడుకుంటూ బెడ్‌రూంలోకి వెళ్లిపోయాడు. ఫోన్ అయిపోయిందో లేదో కానీ బెడ్‌రూంలో లైటూ వెలగడం మానేసింది. మనకున్న టెన్షన్ వాడికేం లేదు" గలగల మాట్లాడుతోంది భార్య. నేను ఎప్పుడో వినడం మానేశాను.

"వాళ్లిద్దరికీ పెళ్లి చేస్తేగానీ ఈ అర్ధరాత్రి దాకా ఫోన్లు మనకి తప్పవు, అన్నయ్యగారితో మాట్లాడండి" అంది నవ్వుతూ. ఆమె మాటా నవ్వూ కూడా నా గుండెలో బాంబులు పేలుస్తున్నట్టే ఉంది.

"భోజనం చేద్దాం రండీ" అందామె.

"ఫ్రెండు కనిపిస్తే హోటల్‌కెళ్లాను" అన్నాను.

"హోటల్‌కో బార్‌కో నాకు తెలుసులెండీ. ఆనందం వచ్చినా దుఃఖం వచ్చినా మీ కథ నాకు తెలియదూ. సరే - పడుకోండి! నేనన్నం తిని హాయిగా హాలులో దివాన్ మీద పడుకుంటాను"

బార్లో తీరే బాధ కాదిది. అన్నం తినే సమయం కాదు. గొంతు నిండా బెంగ, ఉండ చేసి మింగినట్టు బరువుగా ఉంది. గుండె నిండా దిగులు కొలిమిచేసి మండించినట్టుంది. గట్టిగా తలుపులు బిగించి బర్ మని ఏడవాలనిపిస్తోంది - తడబడుతున్న కాళ్లతో రూంలోకెళ్లి తలుపులు మూసి, తలపులు తెరిచాను.

* * *

రాజేంద్ర చాలా ఆరోగ్యంగానే పెరిగాడు. ఆర్నెల్లకోసారి కచ్చితంగా రక్తదానం చేస్తాడు. ఎప్పుడు ఎక్కడ ఏ పొరపాటు జరిగిందో తెలీదు. చిన్నపాటి జ్వరానికి బ్లడ్ టెస్ట్ చేయించుకుంటే పిడుగు నెత్తి మీద పడినట్టు హెచ్.ఐ.వి. పాజిటివ్ అని తేలింది. కళ్లే కాదు భూమంతా తిరిగినట్టు అనిపించింది నాకు. ఈ దుర్వార్త వాడికి చెప్పకుండా గుండె ఆగిపోతే ఎంత బాగుంటుంది.

ఆగిపోయేదే అయితే డాక్టరుగారు రిపోర్టు చూసి చెప్పగానే ఆగిపోయేది. ఇంటికొస్తుండగా మధ్యలోనైనా పోయేది- ఇది మొండి గుండె.

నిజం ఆ పరిస్థితుల్లో రాజుని నివేదితగారికి ఇచ్చేద్దాం అనుకోవడం మరీ బండతనం.

తెల్లారగానే ఆవిడొస్తుంది.

నేను ఈ విషయం చెప్పి రాజుని ఆవిడకప్పగించాలంటేనే భయం భయంగా ఉంది. ఇరవై మూడేళ్లు పెంచిన మమకారం వాడిపైన పెంచుకున్న ఆశలు మనస్సుని ఒకచోట నిలవనివ్వట్లేదు. విని నా భార్య తట్టుకోగలదా? అర్థంకావట్లేదు.

రాజు ఎలా రియాక్ట్ అవుతాడు?

పిచ్చి పిల్ల ప్రభావతి, వాడి మీద ఎన్ని ఆశలు పెట్టుకుందో. ఆ పిల్లా ఆత్మహత్య చేసుకోదూ- రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా కళ్లు పొడిబారకుండా గడిపాను.

* * *

కాలింగ్ బెల్ మ్రోగింది. వినిపిస్తోంది. నాకు లేవాలనిపించలేదు. వచ్చిందెవరో నాకు తెలుసు, నివేదితగారే! కొంతసేపటికి నా తలుపు చప్పుడైంది! బలవంతంగా లేచాను!!


రాజు!!

తలదించుకుని నించున్నాడు.

"నాన్నగారూ మీకోసం ఎవరో వచ్చారు, నివేదితగారట" అంటున్నాడు.

ఎవరో కాదు నివేదిత నీ కన్నతల్లి అని మనసులో అనుకున్నాను. "ఒక్క నిమిషంలో వస్తాను. కూర్చోమను" అని చెప్పి బాత్రూంలోకి వెళ్లాను.

మొహం, కళ్లు కడుక్కోడానికి ట్యాపు నీళ్లు అవసరం లేదేమో. మొహం అంతా చమట్లు, కళ్లనిండా నీళ్లు పొంగుతున్నాయి. చల్లటి నీళ్లు నాకేమాత్రం ఊరటనివ్వలేదు. మనస్సుని మభ్యపెట్టుకుని బయటికెళ్లాను.



నివేదితగారు రాజుతో చాలా ఆప్యాయంగా మాట్లాడుతోంది. కొంతసేపు వాళ్లిద్దర్నీ సైలెంటుగా చూశాను. నివేదిత రాజుని తీసుకెళ్లిపొమ్మని చెప్పడానికి ఆ సన్నివేశం కొంచెం ధైర్యాన్నిచ్చింది.

నన్ను చూడగానే నివేదిత సోఫాలోంచి లేచి నిలబడి "నమస్తే" అన్నారు.

రెండు చేతులు జోడించి సైలెంటుగా, ఎదుటి సోఫాలో కూర్చున్నాను. "అమ్మేది రాజూ" అన్నాను.

"గుడికెళ్లి వస్తానంది. నాకు మొన్న జ్వరం వచ్చినప్పుడు పూజలు చేస్తానని మొక్కుకుందిట. మిమ్మల్ని అప్పుడే నిద్ర లేపొద్దంది- కానీ... మేడంగారు వచ్చారు కదా అనీ.."

"నువ్వెళ్లి, మనందరికీ టిఫిన్ తీసుకురా" అంటూ రాజుని బయటికి పంపించేశాను.

ఎలా మొదలెట్టానో ఎలా చెప్పేనో నాకే తెలియదు. కొంత చెప్పీ కొంత...చెప్పడం చేతకాక...బ్లడ్ టెస్ట్ రిపోర్టులన్నీ చూపించాను.

"అబ్బాయికి చెప్పారా ఈ సంగతి?" అన్నారు ఆమె.

తల అడ్డంగా ఊపాను.

ఆవిడ ప్రొఫెషనల్‌గా నర్సు. ఈ కేసులూ, కేసు షీట్లు, రిపోర్ట్లు- ఆవిడనంత కంగారుపెట్టలేదు.

"వాడు చాలా బుద్ధిమంతుడు. ఏ తప్పు చేసే రకం కాదు. వాడికిలాంటి రోగం వచ్చిందంటే నేను తట్టుకోలేకపోతున్నాను. నా భార్యకి ఈ సంగతి తెలిస్తే అస్సలు పట్టుకోలేం" అన్నాను గొంతు పెగుల్చుకుని.

"చూడండి చక్రధర్‌గారూ, రాజుని పెంచిన మమకారంతో మీరెంత బాధపడుతున్నారో నాకు తెలుసు. కానీ ఇది గుట్టుగా దాచుకోవలసిన జబ్బు కాదు. కృంగి కుమిలిపోవలసిన పరిస్థితీ కాదు. భయపడటానికి అంటురోగం కాదు" అందావిడ.

"కన్నతల్లి మీరంత ధైర్యంగా మాట్లాడుతున్నారంటే మీ నర్సు వృత్తి మీకా నిబ్బరాన్నిచ్చింది కానీ, పెంచిన ప్రేమ ఇంకా గొప్పది. అందుకే వాడికి చిన్న అనారోగ్యం చేసినా తట్టుకోలేం" అన్నాను.

"అందుకని ప్రేమగా పెంచుకున్న రాజుని ఇప్పుడు కన్నతల్లినని నాకప్పగించేస్తే తట్టుకోగలరా"

నా కళ్లల్లో నీళ్లు చెంపలమీద పడి గొంతు గుండెలోకి దిగిపోయింది.

"దుఃఖంతో నేనీ రహస్యాన్ని గుండెల్లో పెట్టుకుని, వాడితో ఆనందంగా ఉండగలనా.. చెప్పండి" అన్నాను.

"రహస్యం అని గుండెల్లో దాచి ఉంచుకోవాలని అనుకోవడమే మీరు చేస్తోన్న తప్పు. రాజు రాగానే నేను చెబుతాను. అతనితో మాట్లాడిన కొద్దిసేపట్లోనే అతనెంత స్పోర్టివ్, ఏక్టివ్ మనిషో అర్థం అయింది. అతను అప్సెట్ అవడు. ధైర్యంగా జీవితాన్ని పెంచుకుంటూ గడుపుతాడు"

"వాడితో చెప్పేస్తారా?" వణికిపోతూ అన్నాను.

"చెప్పాలి- చెప్పితీరాలి. ఎయిడ్స్ గురించి అందరికీ అవగాహన ఉండాలి. అదే మేం అందరం చేస్తున్న పని. మనందరం చేయాల్సిన పనీను"

ఆవిడ మాటలు నాకేం రుచించట్లేదు. "మీ బిడ్డని మాకిచ్చి ఇన్నాళ్లు మమ్మల్ని ఆనందపరిచారు. ఈ రోజు వాడికి కన్నతల్లి ఎవరో తెలిస్తే ఆమె ప్రేమని కూడా పొందుతాడని..." అంటూ నసిగాను.

"కన్నతల్లిగా నన్ను పరిచయం చేసుకుంటా. నర్సుగా అతని యోగక్షేమాలు చూస్తాను. అతనికొచ్చిన ప్రోబ్లమ్ గురించి చెప్పి... మనందరం కల్సి ఉండేలా ప్రయత్నం చేద్దాం" అంది నివేదిత.

"శభాష్ ఆంటీ. మీ మాటలు నాకు నచ్చాయి" అంటూ ఎంటరయిన రాజుని చూసి నేను అవాక్కయ్యాను. వాణ్ని కౌగిలింతలో నలిపేసి కన్నీళ్లతో తడిపేశాను. వాడే నన్ను ఓదారుస్తున్నాడు.

●